సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



ఎన్నికల్లో సత్తా చాటుదాం

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదామని మంత్రి జూపల్లి కృష్ణరావు అన్నారు.

వివరాలు 8లో ▸



నమో.. నారాయణాయ

మన్యంకొండ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.3 /13.2

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి.. ఉదయం, రాత్రి వేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన ఎంవీఐ రఘుకుమార్

పాలమూరు: మహబూబ్‌నగర్ ఎంవీఐగా పి.రఘుకుమార్ సోమవారం జిల్లాకేంద్రంలోని ఆర్టీఏ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఎంవీఐగా పనిచేసిన నరేష్ జహీరాబాద్ చెక్‌పోస్టుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రఘుకుమార్ జిల్లాకు వచ్చారు. నూతన ఎంవీఐని ఆర్టీఏ ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని సింహగిరి కొత్తగంజ్‌లో వెలసిన శ్రీలక్ష్మీనృసింహస్వామివారి దేవస్థానం 37వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి 25వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజు శ్రీసుదర్శన నరసింహ హోమం, బుధవారం ధ్వజారోహణం, గురువారం స్వామివారి ఎదుర్కోళ్లు, ఉదయం శేష వాహనసేవ, సాయంత్రం హనుమత్‌వాహనసేవ, శుక్రవారం శ్రీస్వామివారి కల్యాణోత్సవం, గరుడ వాహన సేవ, శనివారం రథోత్సవం, సూర్యప్రభ వాహన సేవ, ఆదివారం 108 వెండి కలశాలతో అష్టోత్తర శత కలశాభిషేకం, శ్రీస్వామివారి చక్రతీర్థం తదితర పూజలు నిర్వహించనున్నారు. వికాస తరంగిణి పాలమూరు ఆధ్వర్యంలో సామూహిక శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహిస్తారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి : ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా నుంచి కొత్తగా రిక్రూట్ అయిన సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు శిక్షణలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. ఇటీవల జిల్లా నుంచి ఎంపికైన సివిల్, ఏఆర్ 200మంది కానిస్టేబుళ్లకు సోమవారం జిల్లా పరేడ్ మైదానంలో ఎస్పీ కిట్ ఆర్టికల్ అందజేశారు. అనంతరం శిక్షణ సమయంలో ఎలాంటి నిబంధనలు పాటించాలి అనే అంశంపై నూతన పోలీస్ సిబ్బందికి తెలియజెప్పారు. బుధవారం నుంచి 9నెలల పాటు నిర్వహించే శిక్షణను ప్రతిఒక్కరూ విజయవంతంగా పూర్తిచేయాలని సూచించారు. జిల్లా నుంచి 94 మంది సివిల్ కానిస్టేబుళ్లు (పురుషులు), 42 మంది మహిళ కానిస్టేబుళ్లు వరంగల్‌కు శిక్షణకు వెళ్తారన్నారు. ఏఆర్ కానిస్టేబుళ్లు (పురుషులు) 55 మంది ఎంబీఎల్‌సీ గోషామహల్ హైదరాబాద్ వెళ్తారని, ఏఆర్ కానిస్టేబుళ్లు (మహిళలు) 9 మంది అభ్యర్థులు టీఎస్‌పీఏ హైదరాబాద్‌కు శిక్షణ కోసం వెళ్తున్నట్లు చెప్పారు. అలాగే జడ్చర్ల శిక్షణ కేంద్రానికి 248 మంది సివిల్ మెన్ మంగళవారం వస్తున్నారని, ఇందులో ఆదిలాబాద్ నుంచి 101, నిర్మల్ నుంచి 75, కొమరంభీం ఆసిఫాబాద్ నుంచి 72 మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ సురేష్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఏఓ రుక్మిణి పాల్గొన్నారు.

25న పుస్తకావిష్కరణ సభ

పాలమూరు: వనపర్తికి చెందిన రాఘవశర్మ 1959– 1973 కాలంలో రాసిన పుస్తకాలను పాలమూరు అధ్యయన వేదిక ఆయన జ్ఞాపకాలను పుస్తక రూపకంలో తీసుకువచ్చిందని ఆ పుస్తకాన్ని ఈ నెల 25న పాలిటెక్నిక్ కళాశాల ఆడిటోరియంలో 'వనపర్తి ఒడిలో' పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ హరగోపాల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు. సభకు వనపర్తిలో ఉన్న రచయితలు, సాహితీ వేత్తలు, సామాజిక, రాజకీయవేత్తలు తప్పక హాజరుకావాలని కోరారు.

ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించాలి




అడ్డాకుల: ఇంటర్మీడియట్ పరీక్షలను సజావుగా నిర్వహించాలని డీఐఈఓ శ్రీధర్ సుమన్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన పర్యావరణ విద్య పరీక్షను, అన్ని గదుల్లో కలియతిరిగి పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపల్ గదిలో కళాశాల రికార్డులను పరిశీలించి అధ్యాపకులతో మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకునే విధంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం డీఐఈఓను అధ్యాపకులు శాలువాతో సత్కరించారు.

కమలదళం.. కదనోత్సాహం

నేటి నుంచి బీజేపీ విజయ సంకల్ప్ యాత్ర

- మక్తల్‌లోని కృష్ణానది తీరం నుంచి ప్రారంభం
- హాజరుకానున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి రూపాల
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ మీదుగా నల్లగొండ లోక్‌సభ పరిధిలోకి..
- ఉమ్మడి జిల్లాలో 8 రోజులపాటు సాగనున్న బస్సుయాత్ర

కృష్ణమ్మ క్లస్టర్ (మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ పార్లమెంట్)లోని 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 11 రోజులపాటు 926 కిలోమీటర్ల మేర బీజేపీ విజయ సంకల్ప్ యాత్రకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి పాలమూరులో ఉన్న మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ పరిధిలోని 14 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎనిమిది రోజుల (ఈ నెల 27వ తేదీ వరకు)పాటు 756 కి.మీ.,ల మేర యాత్ర కొనసాగనుంది.



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: తెలంగాణలో అత్యధిక ఎంపీ స్థానాలు గెలవాలని భావిస్తున్న భారతీయ జనతా పార్టీ ప్రత్యేక వ్యూహంతో ముందుకుసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పార్లమెంట్ల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టేలా ఐదు క్లస్టర్లుగా విభజించి విజయ సంకల్ప్ యాత్రకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పాలమూరుపై ప్రత్యేక ఫోకస్ పెట్టిన కమలనాథులు కృష్ణమ్మ సాక్షిగా మంగళవారం బస్సు యాత్ర ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, సహకార శాఖ మంత్రి పర్షోత్తం రూపాలతోపాటు జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ హాజరుకానున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణా మండల కేంద్రం కృష్ణానది తీరంలో కిషన్‌రెడ్డి, రూపాలా కృష్ణమ్మ విగ్రహానికి పూజలు నిర్వహించి యాత్రను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో కమలం శ్రేణుల్లో కదనోత్సాహం తొణికిసలాడుతోంది.

రోడ్‌షోలు.. కార్నర్ మీటింగ్‌లు

పాలమూరులో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆధ్వర్యంలో విజయ సంకల్ప్ యాత్ర కొనసాగనుంది. ఈ మేరకు బస్సు యాత్ర సాగే దారిలో రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. మండల కేంద్రాల్లో నేతలు రోడ్‌షో ద్వారా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగనున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ పరిధిలో ఉన్న 14 అసెంబ్లీ నియోజవర్గ కేంద్రాల్లో రోడ్‌షోలతోపాటు కార్నర్ మీటింగ్‌లు నిర్వహించనున్నారు.

సెంటిమెంట్ కలిసొస్తుందా..

తెలంగాణ ఉద్యమ సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కిషన్‌రెడ్డి పాలమూరు పోరు యాత్రను ఇక్కడి నుంచే ప్రారంభించారు. మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణా మండలంలో నదీతీరంలో కృష్ణమ్మ విగ్రహాన్ని ఆయనే ఆవిష్కరించి.. పోరుయాత్ర చేపట్టారు. ఆ తర్వాత 2012లో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి మృతిచెందడంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక వచ్చింది. ఆ సమయంలో బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్)లో టికెట్ రాకపోవడంతో బీజేపీలో చేరిన యెన్నం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొంది సంచలనం సృష్టించారు. పాలమూరు పోరు యాత్ర యెన్నం గెలుపుతో పాటు బీజేపీకి ప్లస్ కాగా.. అదే సెంటిమెంట్‌తో కిషన్‌రెడ్డి మళ్లీ కృష్ణా తీరం నుంచే ఈ యాత్రకు శ్రీకారం చుట్టినట్లు కమలం శ్రేణులు చర్చించుకుంటున్నాయి.



కృష్ణమ్మ క్లస్టర్ పరిధిలో బీజేపీ యాత్ర ఇలా..

తేదీ	అసెంబ్లీ నియోజకవర్గాలు	కి.మీ.,లు
20	మక్తల్/ నారాయణపేట	33
21	నారాయణపేట/ కొడంగల్/ మహబూబ్‌నగర్	82
22	దేవరకద్ర, జడ్చర్ల	123
23	జడ్చర్ల/ షాద్‌నగర్/ కల్వకుర్తి	118
24	నాగర్‌కర్నూల్/ వనపర్తి	140
25	వనపర్తి/ అలంపూర్	70
26	గద్వాల/కొల్లాపూర్	113
27	కొల్లాపూర్/ అచ్చంపేట	77

'మహబూబ్‌నగర్'పై ధీమా..

2018 ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్) ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ.. ఎంపీగా పోటీ చేసిన డీకే అరుణ ముచ్చెమటలు పట్టించారు. ఈసారి ఇక్కడ కాషాయ జెండా ఎగురవేసేలా గురి పెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆ పార్టీ నేతలు సదరు లోక్‌సభ పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తృత పర్యటనలు చేస్తూ కదన రంగంలో దూసుకెళ్తున్నారు. కేంద్ర పథకాలు, ప్రధాని మోదీ చరిష్మాతోపాటు ఎనిమిది శతాబ్దాల రామభక్తుల కల అయోధ్య నిర్మాణం నెరవేర్చిన వేళ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్‌లోని ఏడు అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసినప్పటికీ.. పార్లమెంట్ ఎన్నికల్లో తమదే విజయం అనే ధీమా ఆ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

తొలిరోజు ఇలా..

మంగళవారం కృష్ణాలో యాత్ర ప్రారంభమైన తర్వాత మాగనూరు మీదుగా ఉదయం 11 గంటలకు మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ టెంపుల్ క్రాస్‌రోడ్డుకు చేరుకోనుంది. అక్కడ ప్రారంభ సభ తర్వాత ఊట్కూరు, సింగారం గేట్ మీదుగా నారాయణపేట వరకు యాత్ర సాగనుంది. బస్టాండ్ క్రాస్ రోడ్డులో కార్నర్ మీటింగ్ అనంతరం నేతలు రాత్రి నిద్ర చేయనున్నారు.

కేంద్ర మంత్రి పర్షోత్తం రూపాల పర్యటన షెడ్యూల్ ఇలా..

ఉదయం 9.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు మక్తల్ వచ్చి యాత్ర ప్రారంభిస్తారు. 2.10 గంటలకు ఊట్కూరుకు వచ్చి.. 2.15 నుంచి 2.45 గంటల వరకు రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. 2.50 నుంచి 3 గంటల వరకు భోజన విశ్రాంతి ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు ఊట్కూరు నుంచి శంషాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.

ఎవరికి వారు..



డీకే అరుణ
శాంతికుమార్
ఏపీ జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్థానానికి టికెట్ కోసం బీజేపీ నుంచి పోటీపడుతున్న సీనియర్ నేతలు డీకే అరుణ, ఏపీ జితేందర్‌రెడ్డి, శాంతికుమార్ ఎవరికి వారు టికెట్ తమకే వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ పార్లమెంట్ పరిధిలో డీకే అరుణ, శాంతికుమార్ విస్తృత పర్యటనలు చేస్తున్నారు. విజయ సంకల్ప్ యాత్రకు సంబంధించి ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో డీకే అరుణ ఉన్న ఫ్లెక్సీలు భారీగా వెలిశాయి. మాజీ మంత్రిగా ఉమ్మడి జిల్లాలో ఒక వెలుగు వెలిగిన ఆమె తన సీనియారిటీ, తనకున్న ఓటు బ్యాంకు, కేంద్ర పథకాలు, మోదీ చరిష్మా కలిసి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ ఇది వరకే ఎన్నికల సన్నాహాలు మొదలుపెట్టారు. అదేవిధంగా శాంతికుమార్ సైతం లక్షలాదిగా ఇంటింటికీ పోస్టర్లు వేయిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో వెనకబడిన వర్గాలకు చెందిన వ్యక్తికే ముఖ్యమంత్రి పదవి ఇస్తామని బీజేపీ అధిష్టానం ప్రకటించిందని ఆయన గుర్తు చేస్తున్నారు. ఇప్పటికే తాను రెండు పర్యాయాలు టికెట్ త్యాగం చేశానని.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో బీసీలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఈసారి తనకే పోటీ చేసే అవకాశం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నేతల మధ్య వైరుధ్యం విజయ్ సంకల్ప్ యాత్రపై పడుతుందా.. అధిష్టానం సమస్య పరిష్కరిస్తుందా అనే దానిపై పార్టీలో చర్చ జోరుగా సాగుతోంది.

దండిగా నిధులు

పీఎం ఉషా స్కీం ద్వారా పీయూకు రూ.100 కోట్లు విడుదల

- వసతులు, రీసెర్చ్, కొత్త కోర్సులకు కేటాయింపు
- పకడ్బందీగా వినియోగంపై అన్ని డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు
- నేడు వీసీ ద్వారా ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- యూనివర్సిటీ ఏర్పడిన తర్వాత ఇవే అత్యధిక నిధులు



ఆరేళ్లలో పీయూ బడ్జెట్ ప్రతిపాదనలు, వచ్చిన నిధులు (రూ.కోట్లలో..) ఇలా..

సంవత్సరం	ప్రతిపాదనలు	కేటాయించిన నిధులు
2018- 19	110	26.63
2019- 20	119	6.63
2020- 21	126	7.36
2021- 22	137	7.58
2022- 23	75	9.58
2023- 24	105	100

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రతి ఏడాది అత్తెసరు నిధులతో కనీస వసతులకు నోచుకోక సతమతమైన పీయూకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. గతంలో ఎప్పుడు లేని విధంగా కళాశాల ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసింది. పీయూలో అభివృద్ధి పనులు, వసతులు తదితర అంశాలపై బడ్జెట్ సమావేశాలకు ముందు పీయూ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి రూ.105 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. దీంతో కేంద్ర ప్రభుత్వం పీఎం ఉషా (ప్రధానమంత్రి శిక్ష ఉచ్చతర్ అభియాన్) ద్వారా రూ.100 కోట్ల నిధులు విడుదల చేసింది. దేశంలోని 25 రాష్ట్రాల్లో ఒక్కో యూనివర్సిటీ చొప్పున ఎంపిక చేయగా.. తెలంగాణ నుంచి పీయూకు అదృష్టం వరించింది. రాష్ట్రంలో పెద్ద యూనివర్సిటీలైన ఉస్మానియా, కాకతీయలను కాదని పీయూకు రూ.100 కోట్లు కేటాయించడంతో విద్యార్థి సంఘాలు, సిబ్బంది, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాధాన్యత క్రమంలో..

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులలో రూ.80 కోట్లు కొత్త హాస్టళ్లు, తరగతి గదులు, రీసెర్చ్ భవనాలు, లైబ్రరీల నిర్మాణం కోసం, రూ.5 కోట్లు పాత భవనాల మరమ్మతుకు కేటాయించనున్నారు. మరో రూ.3 కోట్లు (సాఫ్ట్ కాంపోనెట్స్) కంప్యూటర్ ఆధారిత విద్య, వీడియోల తయారీ, కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటు తదితర వాటికోసం వినియోగించాల్సి ఉంది. రీసెర్చ్ కోసం ఏకంగా రూ.14 కోట్లతో వసతులు కల్పించనున్నారు. అయితే ఈ నిధులను పకడ్బందీగా వెచ్చించేందుకు పీయూలో 18 డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని నియమించనున్నారు. ఈ కమిటీ ప్రాధాన్యత క్రమంలో చేపట్టాల్సిన పనులను గుర్తించి నివేదిక ఇస్తుంది. దీనిపై అధికారులు చర్చించి ఎగ్జిక్యూటివ్ కమిటీ అనుమతితో నిధులు కేటాయిస్తారు.

నేడు ప్రారంభించనున్న ప్రధాని

ప్రధానమంత్రి శిక్ష ఉచ్చతర్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 11.30 గంటలకు పీయూ ఆడిటోరియంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారు. అలాగే ప్రధాని పీయూ విద్యార్థులతో ఆన్‌లైన్‌లో మాట్లాడే అవకాశం ఉంది. కార్యక్రమానికి వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

సమష్టి సహకారంతో మంజూరు

పాలమూరు యూనివర్సిటీకి కేంద్ర ప్రభుత్వం పీఎం ఉషా స్కీం ద్వారా రూ.100 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయం అని వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. పీయూలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. రూ.100 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు, రీసెర్చ్ సెంటర్, సాఫ్ట్ కాంపోనెంట్ కోసం వెచ్చిస్తామన్నారు. నిధుల మంజూరుకు సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు, విద్యాశాఖ సెక్రటరీ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎంతో సహకరించారన్నారు. ఈ నిధులను పీఎం మోదీ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తారన్నారు. పీయూ పక్కన ఉన్న 25 ఎకరాల భూమిని యూనివర్సిటీకి కేటాయించాలని కోరారు. యూనివర్సిటీలో లా, ఇంజినీరింగ్ కళాశాలల కోసం ప్రతిపాదనలు పంపామని, వాటిని నిర్మించేందుకు భూమి కేటాయిస్తే వీలుగా ఉంటుందన్నారు. మరో 2 నెలల్లో న్యాక్ కమిటీ తనిఖీలు ఉన్న నేపథ్యంలో పీయూ మంచి వసతులు కల్పించి ఏ గ్రేడ్ సాధించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పీయూ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. 2014 తాను ఎమ్మెల్యేగా ఉన్న క్రమంలోనే యూనివర్సిటీకి నిధులు తీసుకువచ్చేందుకు కృషిచేశామన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రూ.100 కేటాయించడం గొప్ప విషయం అన్నారు. పీయూ అభివృద్ధి కోసం రాజకీయాలు, బేషజాలు లేకుండా పనిచేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా పీయూకు నిధులు తీసుకువచ్చేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. సమావేశంలో పీయూ వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, ఏఆర్ వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, శ్రీధర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా ఆస్తిపన్ను లక్ష్యం చేరాలి



మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం– 2023– 24 ముగిసేలోగా ఆస్తిపన్ను, నల్లా బిల్లులు వసూలు చేయడంలో లక్ష్యం చేరుకోవాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో ఆయా విభాగాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 27 శాతం మాత్రమే ఆస్తిపన్ను వసూలు చేయడం ఏమిటని అధికారులను ప్రశ్నించగా.. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు, త్వరలో వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు సిబ్బందిని కేటాయించడంతో ఈ పరిస్థితి నెలకొందని వారు బదులిచ్చారు. సమయం చాలా తక్కువగా ఉన్నందున ప్రత్యేక శ్రద్ధ పెట్టి వీలైనంత వరకు వసూళ్లను ఎక్కువ చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ పవన్‌కుమార్, ఎంఈ బస్వరాజ్, డీఈఈ బెంజిమెన్, ఆర్‌ఓ మహమ్మద్ ఖాజా, ఏఈలు హరికృష్ణ, వైష్ణవి, సాయిరాం, టీపీఓ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

22న మున్సిపల్ బడ్జెట్ సమావేశం

వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం తన చాంబర్‌లో ఆయా విభాగాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పనులకు తప్ప ఆ రోజు వేరే అంశాలను అజెండాలో పెట్టొద్దన్నారు. ఆదాయం, వ్యయ పద్దులను వాస్తవికతకు దగ్గరగా ఉండేలా తయారు చేయాలని సూచించారు. అలాగే వివిధ పనులపై మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలను ఎక్కువగా తిప్పించుకోవద్దన్నారు. సాధ్యమైనంత వరకు సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రజావాణిలో భాగంగా వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో ఎక్కువగా భూములు, వ్యకిగత సమస్యల పరిష్కారం, పింఛన్, ఉపాధి, ఉద్యోగాల కోసం ప్రజలు అర్జీలు సమర్పించారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడే పరిష్కరించాలన్నారు. జాప్యం చేయడం వల్ల ఫిర్యాదుదారులకు ఇబ్బంది కలగడమే కాకుండా.. తిరిగి ఫిర్యాదు చేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మోహన్‌రావు, శివేంద్ర ప్రతాప్, జెడ్పీసీఈఓ రాఘవేందర్‌రావు, డీఆర్‌డీఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించండి..

నాకు రెండు కాళ్లు లేవు. లైఫ్ టైం సదరం సర్టిఫికెట్ ఉంది. పదేళ్ల నుంచి ఆసరా పింఛన్ కోసం తిరుగుతున్నా.. ఎన్నిసార్లు ఉన్నతాధికారులను కలిసినా ప్రయోజనం లేకుండాపోయింది. నాకు ఏ ఆధారం లేదు. నన్ను చూసుకునే వారు లేరు. ఆసరా పింఛన్ ఇచ్చి ఆదుకోండి. ఊరి నుంచి వచ్చిన ప్రతిసారి రూ.వెయ్యి ఖర్చు అవుతుంది. అసలే పేదరికంలో ఉండటం వల్ల ఇబ్బంది పడుతున్నాను.

– రజిత, గొల్లపల్లి, జడ్చర్ల మండలం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవినాయక్

శివాజీ అడుగుజాడల్లో పయనించాలి



జిల్లాకేంద్రంలో చత్రపతి శివాజీ శోభాయాత్రలో పాల్గొన్న యువకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జిల్లాకేంద్రంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బండమీదిపల్లి నుంచి శివాజీ మహారాజ్ విగ్రహంతో శోభాయాత్ర వన్‌టౌన్, క్లాక్‌టవర్, అశోక్‌టాకీస్ చౌరస్తా, న్యూటౌన్ మీదుగా శెట్టి కాంప్లెక్స్ వరకు సాగింది. అంతకుముందు ఎమ్మెల్యే యెన్నం బండమీదిపల్లిలో శివాజీ విగ్రహానికి పూలమాల వేసి.. శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివాజీ అడుగుజాడల్లో నడవాలని కోరారు. వచ్చే ఏడాది శివాజీ జయంతి వరకు కాంస్య విగ్రహం ఏర్పాటు చేసుకుందామన్నారు.

క్లుప్తంగా

బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని గుడిపల్లి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రేవల్లి మండలం గొరిదేవిపల్లికి చెందిన మల్లయ్య(44) పని నిమిత్తం ద్విచక్రవాహనంపై జిల్లా కేంద్రానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. వనపట్లకి చెందిన మహేష్ ద్విచక్రవాహనంపై వెళ్తూ.. గుడిపల్లి గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. మల్లేష్‌కు తీవ్ర గాయాలై సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గోవర్ధన్ తెలియజేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి..

తాడూరు: మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పొలుమూరు సమీపాన చోటు చేసుకుంది. ఎస్‌ఐ పుట్ట మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బల్మూరు మండలం కొండనాగులకు చెందిన మహ్మద్‌రఫీ(50) కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా తిరిగేవాడని, వారం రోజుల క్రితం కల్వకుర్తికి వెళ్లి తిరిగి అచ్చంపేటకు వచ్చే క్రమంలో తాడూరు మండలం పొలుమూరు సమీపాన చెరువు కట్ట వద్ద శవమై కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు అతని దగ్గర ఉన్న ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకుని కుటుంబ సభ్యులకు వివరాలు పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మహిళ బలవన్మరణం

గోపాల్‌పేట: మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ కుటుంబ కలహాలతో తలకు వేసుకునే రంగు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన శకుంతల(34)కు నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని తిమ్మరాజుపల్లికి చెందిన వ్యక్తితో 14 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాలుగు సంవత్సరాలుగా ఆమె కుటుంబం గోపాల్‌పేటలో ఉంటూ జీవిస్తుంది. కుటుంబ కలహాలతో ఈ నెల 13న రాత్రి ఆమె తలకు వేసుకునే రంగు తాగి ఎవరికీ చెప్పకుండా నిద్రపోయింది. మధ్యరాత్రి ఆయాసం అవుతుండటంతో కుటుంబ సభ్యులు ఏమైందని ప్రశ్నించారు. తలకు వేసుకునే రంగు తాగానని చెప్పింది. వెంటనే ఆమెను కుటుంబ సభ్యులు కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం రాత్రి మృతిచెందింది. సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలియజేశారు.

కారు, బైక్ ఢీ

- నలుగురికి తీవ్ర గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనగా నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని సోమవారం చోటుచేసుకుంది. నారాయణపేట జిల్లాకు చెందిన రవికుమార్, జనార్దన్ బైక్‌పై శ్రీశైలంకు వెళ్తుండగా, తెలకపల్లి వైపు నుంచి వచ్చిన కారు ఎదురెదురుగా జిల్లా కేంద్రంలోని జ్ఞాన సరస్వతీ దేవాలయం సమీపంలో ఢీకొన్నాయి. ఇదే క్రమంలో మరో ద్విచక్రవాహనంపై వస్తున్న కార్వంగకు చెందిన విజేందర్‌రెడ్డి, భార్య మంజుల కారును వెనుక నుంచి ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో జనరల్ ఆస్పత్రికి తరలించారు. రవికుమార్, జనార్దన్‌లకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ తీసుకెళ్లారు. విజేందర్‌రెడ్డి, మంజులను హైదరాబాద్ తరలించారు.

చెరువులో విషప్రయోగం: చేపలు మృతి

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారంలోని చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విషప్రయోగం చేయడంతో చేపలు మృతి చెందిన ఘటన సోమవారం వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువులో నీరు లేకపోవడంతో పశువులు నీరు తాగడానికి అందుబాటులో ఉంటుందనే ఉద్దేశంతో కొంత కాలంగా సమీపంలోని ఓ బోరు నుంచి నీటిని చెరువులో నిల్వ చేశారు. దీంతో ఆ చెరువులో చేపలు కూడా వృద్ధి చెందాయి. ఈ క్రమంలో కొన్ని రోజులుగా గ్రామస్తులు చెరువులోని చేపలు పట్టుకుంటున్నారు. మనస్పర్ధల కారణంగా గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో విషం కలిపారు. దీంతో ఉన్న కొద్దిపాటి చేపలు మృతి చెందాయి. ఇదిలా ఉండగా విషపూరితమైన చెరువు నీరు పశువులు తాగి ఉంటే ఘోర ప్రమాదం జరిగుండేదని గ్రామస్తులు తెలుపుతున్నారు.

నమో.. నారాయణాయ

- మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- కనుల పండువగా సాగిన పల్లకీసేవ

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కోటకదిరలోని ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్ ఇంటి నుంచి స్వామివారి ఉత్సవ మూర్తిని పల్లకీలో మన్యంకొండ దేవస్థానానికి తీసుకెళ్లారు. భాజాభజంత్రీలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య సాగిన స్వామివారి ఊరేగింపులో భక్తుల కోలాటాలు, భజనలు అలరించాయి. కోటకదిర గ్రామం భక్తి పారవశ్యంతో పులకించిపోయింది. కాగడాల వెలుతురులో స్వామివారు ధగధగ మెరుస్తూ భక్తకోటికి దర్శనమిచ్చారు.

స్వర్ణాలంకరణలో స్వామివారు..

మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామిని బంగారు అభరణాలతో అలంకరించి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. హారతి దీపాల వెలుతురులో స్వామివారిని భక్తులు దర్శించుకుని పులకించిపోయారు. పలువురు భక్తులు స్వామివారికి దాసంగాలు, తలనీలాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి..

మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మన్యంకొండ దేవాలయంలో సోమవారం నిర్వహించిన నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి సేవకు అవకాశం రావడం అదృష్టమన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్ ఎమ్మెల్యేను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరాజు, పాలక మండలి సభ్యులు గోవింద్, ప్రభాకర్‌రెడ్డి, అలువేల, మంగమ్మ, శంకర్, కె.సుధ, వనజ, బాలరాజు, శ్రావణ్‌కుమార్, వెంకటాచారి, చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఉత్సవ మూర్తిని పల్లకిలో తీసుకొస్తున్న భక్తులు

వైభవంగా తిరుచ్చిసేవ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి స్వామివారికి తిరుచ్చి సేవ నిర్వహించారు. వెండి పల్లకిలో స్వామివారి ఉత్సవ మూర్తిని గర్భగుడి నుంచి దేవస్థానం ఎదుట ఉన్న మండపం వరకు ఊరేగించారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని గర్భగుడికి తీసుకెళ్లారు. మంగళవారం గజవాహన సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నిత్యానందాచారి పాల్గొన్నారు.


పాలక మండలి సభ్యులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం


గద్వాలలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- పార్లమెంట్ ఎన్నికలపై అలంపూర్, గద్వాలలో సన్నాహక సమావేశాలు

అలంపూర్/ గద్వాల అర్బన్: అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుదామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణరావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికలపై సోమవారం అలంపూర్ చౌరస్తా, గద్వాలలో నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన అవినీతిమయమైందని, అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి కర్ర కాల్చి వాత పెట్టారన్నారు. తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఉన్నా.. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రైతులకు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని ఆరోపించారు. ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించడానికి తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం పూర్తి చేయలేదన్నారు. ఓవైపు ఏపీలో ప్రాజెక్టులు కట్టి శ్రీశైలం నీటిని తరలిస్తున్నారని.. గొప్పగా చెబుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు రూ.లక్ష కోట్లు పెట్టి నిర్మించినా సాగునీరు అందించే పరిస్థితి లేదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నా అవేమీ నెరవేరలేదని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 14 స్థానాల్లో 12 గెలిచామని.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాల్లో 14లో కచ్చితంగా విజయం సాధిస్తామని, అందులో నాగర్‌కర్నూల్ కూడా ఉంటుందని చెప్పారు.

విష ప్రచారంతోనే ఓటమి

అసెంబ్లీ ఎన్నికల్లో విష ప్రచారంతోనే ఎమ్మెల్యేగా ఓడిపోయానని సంపత్‌కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సర్వేలు చేసినా రాష్ట్రంలో భారీ మెజార్టీతో గెలిచే స్థానాల్లో అలంపూర్ ఉండేదని.. చివరి నాలుగు రోజుల్లో విష ప్రచారం చేయడంతో ఓటమి చెందినట్లు వాపోయారు. పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసానిచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఆయా సమావేశాల్లో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎస్‌ఎస్‌యూ రాష్ట్ర నాయకుడు రాజురెడ్డి, నియోజకవర్గంలోని పార్టీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, మండలాల అధ్యక్షులు, బూత్ స్థాయి కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు

ధనిక రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ చేతికి అప్పగిస్తే అప్పుల ఊబిలోకి నెట్టి రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాంగ్రెస్‌కు నష్టం జరుగుతుందని తెలిసినా తెలంగాణ ఇచ్చిన మహనీయురాలు సోనియాగాంధీ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ బంగారు పళ్లెంలో కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని అప్పజెప్పామని ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, బంగారు పళ్లెంలో దాదాపు రూ.8 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అవినీతికి అవకాశం లేకుండా స్వచ్ఛమైన పాలన అందిస్తుందన్నారు. ప్రతిపక్షాల మాటలు విని రైతులు మోసపోవద్దని, వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఒక్కో నియోజకవర్గం నుంచి లక్ష ఓట్ల మెజార్టీ రావడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ రెండు కలిసి పోటీ చేసినా ఎంపీ ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేదన్నారు.

శక్తిపీఠం నిర్లక్ష్యానికి గురైంది..

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలోనే ఏకైక శక్తిపీఠమైన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలు బీఆర్‌ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఢిల్లీలో అధికార ప్రతినిధి మల్లురవి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఏపీసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, మాజీ మంత్రి చిన్నారెడ్డితో కలిసి ఆలయాలకు రాగా.. ఈఓ పురేందర్‌కుమార్, అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం జోగుళాంబ ఆలయాలను విస్మరించిందని.. తమ హయాంలో పర్యాటకంగా అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. ఆలయాల అభివృద్ధికి ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిబంధనలు అడ్డువస్తున్నాయన్న విషయాన్ని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తన దృష్టికి తీసుకొచ్చారని, వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని మల్లురవి అన్నారు. ఇదిలా ఉండగా ఆలయానికి వచ్చిన మంత్రి, ఇతర ప్రముఖులకు కలెక్టర్ సంతోష్‌కుమార్, ఎస్పీ రితిరాజ్ పుష్పగుచ్ఛం అందించారు.


మంత్రికి స్వాగతం పలుకుతున్న ఈఓ, అర్చకులు

నడిగడ్డ ఇలవేల్పు.. జములమ్మ

- నేటి నుంచి జములమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గద్వాలన్యూటౌన్: నడిగడ్డ ఇలవేల్పు.. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న జములమ్మ బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని జములమ్మ, పరుశరామస్వామి ఆలయ సముదాయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నారు. మాఘశుద్ధ పౌర్ణమి (ఈనెల 24) నుంచి ఏరువాక పౌర్ణమి వరకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకోనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అమ్మవారి పుట్టింటికి బయల్దేరనున్న ఎడ్లబండి..

గద్వాల మండలంలోని కృష్ణానది పరీవాహక గ్రామమైన గుర్రంగడ్డ జమ్ములమ్మ పుట్టినిల్లుగా చరిత్ర చెబుతోంది. అక్కడి నుంచి ప్రతి ఏటా అమ్మవారిని మాఘశుద్ధ పౌర్ణమికి ముందుగా వచ్చే మంగళవారం మెట్టినిల్లు అయిన జమ్మిచేడులోని ఆలయానికి ఆహ్వానించేందుకు ఎడ్లబండి బయల్దేరుతుంది. అందులో భాగంగా మంగళవారం ఉదయం 11 గంటలకు గుర్రంగడ్డకు బయల్దేరనున్న ఎడ్లబండికి ప్రత్యేక పూజలుచేసి సాగనంపుతారు.

ఎడ్లబండిపై మెట్టినింటికి అమ్మవారు..

గుర్రంగడ్డలోని కృష్ణానది ఒడ్డున ఉన్న జములమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఎడ్లబండిపై అమ్మవారు మెట్టినింటికి బయల్దేరనున్నారు. మేళతాళాలతో బుధవారం 6 గంటలకు అమ్మవారిని జమ్మిచేడులోని దేవాలయానికి తీసుకొస్తారు.

వైభవంగా పౌర్ణమి వేడుకలు..

మాఘశుద్ధ పౌర్ణమి వేడుకలను అమ్మవారి సన్నిధిలో వైభవంగా నిర్వహిస్తారు. అమ్మవారికి అభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరిస్తారు. అదే రోజు సాయంత్రం పల్లకీసేవ నిర్వహించనున్నారు. ఈవేడుకలకు నడిగడ్డ ప్రాంతంతో పాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది భక్తులు వచ్చి, అమ్మవారిని దర్శించుకోనున్నారు.


జమ్మిచేడులోని జములమ్మ

అన్ని ఏర్పాట్లు చేశాం..



జములమ్మ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక క్యూలైన్, వైద్యసేవలు అందుబాటులో ఉంచాం. తాగునీటి సౌకర్యాన్ని కల్పించాం. పౌర్ణమి రోజు వేలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశాం.

– పురేందర్‌కుమార్, ఆలయ ఈఓ

రూ.4.50 లక్షలు, బంగారం చోరీ


ఇంట్లో చిందరవందరగా పడేసిన వస్తు సామగ్రి

గద్వాల క్రైం: గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.4.50 లక్షల నగదు, మూడు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితులు.. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బింగిదొడ్డికి చెందిన శ్రీనివాసులు వారి కుటుంబ సభ్యులు కలిసి పట్టణంలోని శ్రీనివాస కాలనీలో కొన్ని నెలలుగా ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. అయితే ఆదివారం స్వగ్రామంలో శుభకార్యం నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చి చూసేరికి గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం ధ్వంసం చేసి బీరువాలోని రూ.4.50 లక్షలు, మూడు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారన్నారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణులు నిందితులను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలియజేశారు.

చెంచుల బొడ్డు గుడిసెలు దగ్ధం

మన్ననూర్: నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలోని ఈర్లపెంటలో మూడు బొడ్డు గుడిసెలు దగ్ధమైన సంఘటన నల్లమలలో చోటు చేసుకుంది. బాధితులు ఉడుతనూరి బంగారి, ఉడుతనూరి శివ, కాత్రాజు పోషన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం పెంట సమీపంలోని అడవికి నిప్పు అంటుకుంది. అడవిలో చెలరేగిన మంటలను ఆర్పే అవకాశం లేనందున క్రమక్రమంగా మంటలు విస్తరించి ఒక గుడిసె తర్వాత మరొకటి చొప్పున మూడు గుడిసెలు మంటలు చెలరేగి వంట పాత్రలు తిండి గింజలు, దుస్తులు తదితరాలు పూర్తిగా కాలి బూడిదగా మారడంతో నిరాశ్రయులుగా మారామని వాపోయారు. ఆ సమయంలో మంటలు ఆర్పేందుకు పెంట సమీపంలో నీళ్ల లేని కారణంగా గుడిసెలు తగలబడిపోతుంటే ప్రేక్షక పాత్ర వహించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉండగా.. గుడిసెలు అడవికి కలుపుకొని ఉంటుండటంతో ఈ ప్రమాదం జరిగిందని చెంచులు చెప్పారు. మా పెంట సరిహద్దులకు కొంచమైన రక్షణకు సంబంధించిన అవకాశాలు ఉంటే.. ఈ పరిస్థితి దాపురించేదికాదన్నారు. ఐటీడీఏ, అటవీశాఖ అధికారులు ఆదుకొని సహాయ సహకారాలు అందించాలని బాధితులు కోరుతున్నారు.


ఈర్లపెంటలో కాలి బూడిదైన గుడిసెలు

శాస్త్రవేతల సూచనలతో పంటల సాగు



చిన్నచింతకుంట: రైతులు శాస్త్రవేతలు, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో పంటలను సాగు చేసుకుని, అధిక దిగుబడులు సాధించుకోవాలని పాలెం ఏరువాక కేంద్రం డాట టీసీ సెంటర్ కో–ఆర్డినేటర్ భరత్ భూషణ్, శాస్త్రవేత అర్చన రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని ముచ్చింతల, అప్పంపల్లి, తిర్మలాపురంలో రైతులు సాగు చేసిన వరి, మినుము, ఆముదం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల కారణంగా సాగు చేసిన పంటలకు తెగుళ్ల ఆశిస్తాయన్నారు. రైతులు సరైన సమయంలో మందులను పిచికారి చేసి తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవాలన్నారు. ప్రస్తుతం వరి సాగులో జింక్‌లోపం, కాండం తొలుచు పురుగు ఆశిస్తుందన్నారు. ఆముదం పంటలో పొగాకు లద్దె పురుగు ఆశిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రీజ, సంతోష్, రాజేష్ ఉన్నారు.

'అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలి'

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి జి.హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2022 జూన్ 14న ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకం సైనికులను మోసం చేసేదిగా ఉందని విమర్శించారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో ఈ పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించి ఇప్పటివరకు నియామకాలు చేపట్టలేదన్నారు. నరేంద్రమోదీ రెండో సారి ప్రధానమంత్రి అయిన తర్వాత 2018, 2019, 2020, 2021–22లో త్రివిధ దళాల్లో సైనికుల నియామకం చేపట్టలేదని ఆరోపించారు. కోవిడ్‌తో సైనికుల నియామకాలు జరపలేదని మోదీ అప్పట్లో అన్నారు. 2019, 2021 చివర్లో కరోనా లేదని కాని కరోనా సాకుతో చేపట్టలేదన్నారు. త్రివిధ దళాల్లో ఇప్పటివరకు లక్షా60వేల ఖాళీలు ఉన్నాయన్నారు.

బీసీ బాలికల హాస్టల్ తనిఖీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఏబీసీఓ విఠల్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులకు వడ్డించే అన్నంలో పురుగులు, వడ్లు వస్తున్నాయని పలువురు విద్యార్థులు ఫొటోలు తీసి నాలుగు రోజుల క్రితం జిల్లా అధికారులకు పంపించారు. దీంతో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి ఇందిరా విచారణకు ఆదేశించడంతో సోమవాం జిల్లాకేంద్రంలోని టీచర్స్‌కాలనీలో ఉన్న బీసీ బాలికల వసతిగృహాన్ని జిల్లా అదనపు బీసీ సంక్షేమ అధికారి విఠల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలువురు విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని.. బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను మార్చి కొత్త వాటిని పంపిస్తామని విద్యార్థులకు చెప్పారు. ఆరోగ్యం, చదువుపై పూర్తిస్థాయి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. హాస్టల్ వార్డెన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉదండాపూర్ వద్ద ఇసుక టిప్పర్ల పట్టివేత


జడ్చర్ల పీఎస్‌లో పట్టుబడిన టిప్పర్లు

జడ్చర్ల: ఫిల్టర్ ఇసుకను తయారు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న టిప్పర్లను జడ్చర్ల పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. మండల పరిధిలోని ఉదండాపూర్ గ్రామ సమీపంలోని రిజర్వాయర్‌లోని మట్టిని, నీటిని ఉపయోగించి ప్రతిరోజు ఫిల్టర్ ఇసుకను తయారు చేసి హైదరాబాద్, తదితర ప్రాంతాలకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇసుక తయారీ, తరలింపు సమాచారం అందుకున్న స్థానిక సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. అక్రమ ఇసుకకు సంబంధించిన తొమ్మిది టిప్పర్లను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలియజేశారు.

ప్రతిఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలి

కల్వకుర్తి: ధర్మాన్ని ప్రతిఒక్కరూ ఆచరించటం ద్వారా అది మనలను రక్షిస్తుందని శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురువులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్యులు సెలవిచ్చారు. సోమవారం పట్టణ సమీపంలోని శ్రీ సూర్యలత కాటన్‌మిల్లులోని వేద పాఠశాలలో చంద్రమౌళీశ్వరుల పూజల అనంతరం ఆయన అనుగ్రహణ భాషణం నిర్వహించారు. గత రెండు రోజులుగా కాటన్‌మిల్లులో జగద్గురువులు విడిది చేసి, భక్తులకు అనుగ్రహణం అందించారు. ధర్మం సనాతనమైనదని, విద్యతో సంస్కారం, క్రమశిక్షణ వస్తుందని తద్వారా దేశహితాన్ని ఆశించే ప్రయోజకులుగా నేటి పిల్లలు తయారవుతారని అన్నారు. ధర్మబద్ధమైన జీవనం వలన మానవుడిలో ఎలాంటి చెడు బుద్దులు, దురాలోచనలు రావన్నారు. ఎక్కడో ఉండే ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలకు వెళ్లటమే కాకుండా, ఇంటి ప్రక్కలో ఉండే దేవాలయాలకు వెళ్లాలని భక్తులకు అనుగ్రహ భాషణంలో సూచించారు. భావితరాలను సరైన మార్గంలో నడపటంలో పిల్లలకు ఇప్పటినుంచే దైవిక చింతన అలవర్చాలని, అభ్యాసంతో ఏకాగ్రత దానిద్వారా ధారణ వస్తుందని అన్నారు. తల్లిదండ్రుల నడవడిక, ఆచార వ్యవహారాలు, పాఠశాలల్లో ఉపాధ్యాయుల రుజువర్తన తదితర అంశాలు భావితరాలను సరైన మార్గదర్శనం చేయగలవని సెలవిచ్చారు. అనంతరం చంద్రమౌళీశ్వరుల పూజలను ప్రత్యక్షంగా చూసేందుకు, స్వామివారి అనుగ్రహం పొందేందుకు భక్తులు పెద్దసంఖ్యలో కాటన్‌మిల్లు ప్రాంగణానికి చేరుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా కాటన్‌మిల్లు యాజమాన్యం అన్ని ఏర్పాట్లను చేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి వేద బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు శివరామశర్మ, సాయికిశోర్, రామశర్మ, అల్వాల లక్ష్మణమూర్తి, వేపూరి రామారావు, ప్రహ్లాద్, వేణుగోపాల్ రావు, రఘునందన్, కాటన్‌మిల్లు పీఓ రమణారెడ్డి, కాటన్‌మిల్లు యాజమాన్యం, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


భక్తులకు అనుగ్రహణ భాషణం చేస్తున్న శ్రీశంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్యులు